

డీఎస్పీల బదిలీలు

అమలాపురం టౌన్, ఆగస్టు 8: అమలాపురం ఎస్డీపీవో ఎం.మహేశ్వరరావును పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు సరెండర్ చేశారు. కొత్తపేట డీఎస్పీ కేవీ రమణను సీఐడీ డీఎస్పీగా నియమిస్తూ డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ రెండు స్థానాల్లో డీఎస్పీలను నియమించాల్సి ఉంది.

నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలి



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): స్థానికంగా లభించే కొబ్బరి, ఆక్వా ముడి ఉత్పత్తులను విలువ ఆధారితంగా మార్చే రంగంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా నైపుణ్య కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం స్థానిక యువతను సుదూర ప్రాంతాలకు పంపించడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ విధంగా కాకుండా స్థానికంగానే ఉపాధి కల్పించాలన్నారు. అవసరమైతే విలువ ఆధారిత రంగాల్లో నైపుణ్యత పెంపొందించే దిశగా స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ద్వారా శిక్షణ అందించాలన్నారు. మండలాల వారీగా 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు గల నిరుద్యోగ యువతను గుర్తించి స్థానికంగా శిక్షణలు ఇస్తూ రాయితీలపై యూనిట్లు మంజూరు చేయాలన్నారు. సంబంధిత నివేదికలను ఈ నెల 22వ తేదీన జరిగే సమావేశం నాటికి సిద్ధం చేయాలని జిల్లా నైపుణ్య కమిటీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి యి.వసంతలక్ష్మి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్, వికాస పథక సంచాలకుడు కె.లచ్చారావు, డీఈవో ఎం.కమలకుమారి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకర ప్రసాద్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వర్మ, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్, వికాస మేనేజర్ గోళ్ల రమేష్ పాల్గొన్నారు.

అన్నదాతలకు శుభవార్త

12న రూ.192 కోట్ల ధాన్యం బకాయిల విడుదల

పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ యల్లారావు

అమలాపురం టౌన్, ఆగస్టు 8: జిల్లాలో రైతులకు బకాయి పడ్డ రూ.192 కోట్ల ధాన్యం బకాయిలను ఈ నెల 12న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విడుదల చేయనున్నారని పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ డీవీఎస్ యల్లారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో నిర్వహించే కార్యక్రమంలో నాదెండ్ల మనోహర్ పాల్గొని ధాన్యం బకాయిలు విడుదల చేస్తారన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు 7లో
తిరుమల ఎక్స్‌ప్రెస్ రద్దుపై ప్రయాణికుల అసహనం

మేమెలా చెల్లించేది?

పంచాయతీలపై 'ఎల్ఈడీ' పిడుగు

అసలే నిధులు లేక అల్లాడుతున్న పంచాయతీలకు ఇప్పుడు కొత్త తలనొప్పి వచ్చి పడింది. మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్టు గ్రామాల్లో ఎల్ఈడీ బల్బులు నిర్వహణ కంపెనీలు ఇప్పుడు నోటీసులు పంపిస్తున్నాయి. వెంటనే బకాయిలు చెల్లించాలని చెబుతున్నాయి. అయితే 2019 నుంచి ఎటువంటి నిర్వహణ లేకుండా అసలు బల్బులు ఉన్నాయో లేవో కూడా తెలియకుండా గమ్మున ఉన్న కంపెనీలకు తామెలా బకాయిలు చెల్లిస్తామని పంచాయతీ పాలకవర్గాలు, అధికారులు ప్రశ్నిస్తున్నారు..



ఈఈసీఎల్ కంపెనీ ఏర్పాటు చేసిన బాక్స్

• (పి.గన్నవరం)

- నిర్వహణ లేకున్నా..బకాయిలు చెల్లించాలంటూ నోటీసులు
- 2018లో ఈఈసీఎల్ ద్వారా వీధి దీపాలు ఏర్పాటు
- నిర్వహణ బాధ్యత తీసుకున్న రెండు ప్రముఖ కంపెనీలు
- బల్బుకు మూడు నెలలకు రూ.145 చెల్లించేలా ఒప్పందం!
- వైసీపీ ప్రభుత్వంలో నిర్వహణను పట్టించుకోని కంపెనీలు
- జిల్లాలో రూ.4.68 కోట్లు బకాయిలంటూ ఇప్పుడు నోటీసుల జారీ
- లబోదిబోమంటున్న కార్యదర్శులు, పంచాయతీ పాలకవర్గాలు



వాడ్రేవుపల్లి పంచాయతీ

వైసీపీ ప్రభుత్వంలో నిర్వహణ శూన్యం

ప్రతి గ్రామంలో ఎల్ఈడీ బల్బుల వెలుగులు అందించే లక్ష్యంతో 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఓ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమం నిర్వహణను ఈఈఎస్ఎల్, ఎన్ఈడీఎస్ఏపీ కంపెనీలకు అప్పగించి బల్బుల నిర్వహణ చేస్తూ ఆయా పంచాయతీల నుంచి నిర్దేశించిన రుసుమును వసూలు చేసుకోవాలని సూచించింది. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని మండలాలను ఓ కంపెనీకి మరికొన్ని మండలాలను మరో కంపెనీకి అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చే వరకు కార్యక్రమం సవ్యంగానే సాగింది. 2019 మే నెలలో వైసీపీ ప్రభుత్వం రావడంతో ఎల్ఈడీ బల్బుల నిర్వహణ పూర్తిగా మూలనపడింది. అప్పటి నుంచి పంచాయతీలు ఆపసోపాలు పడుతూ బల్బుల నిర్వహణను చూసుకునేవి..

రూ.4.68 కోట్లు

2019 నుంచి ఎల్ఈడీ బల్బుల నిర్వహణను ఆయా కంపెనీలు గాలికొదిలేశాయి. బల్బులు వెలగకపోయినా, లైన్లలో ఇబ్బందులు ఏర్పడినా ఆయా సంస్థల ప్రతినిధులే చూసుకోవాల్సి ఉంది. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వీటి నిర్వహణ బాధ్యతను పూర్తిగా విస్మరించారు. కొవిడ్ కారణంగా కొంతకాలం పంచాయతీ ఎన్నికలకు బ్రేక్ పడింది. ఆ సమయంలో ప్రత్యేక అధికారులే పంచాయతీలను నడిపించారు. ఆ సమయంలోనే ఎల్ఈడీ బల్బుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అయితే కొత్త సర్పంచులు వచ్చిన తర్వాత

గాలికొదిలేశాయి..

స్థానిక ప్రజానీకం ఇబ్బందులు దృష్ట్యా పంచాయతీల నిధులతోనే వీధి లైట్ల నిర్వహణ చూసుకునేవారు. గడిచిన అయిదేళ్లలో ఆర్థిక సంఘం నిధులు కోసం ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేయడంతో పారిశుధ్యం నిర్వహణే కష్టంగా ఉండట, వాటికి తోడు వీధిలైట్లు బాధ్యత తోడవడంతో పాలన మరింత భారంగా ఉండేది. ఆయా కంపెనీలు ప్రతి 50 ఎల్ఈడీ బల్బులకు ఒక బాక్స్ ఏర్పాటు చేశారు. ఆ బాక్స్‌ల్లో టైమర్, విద్యుత్ మీటరు రీడింగ్‌లు ఉండేవి.. కాలక్రమేణ టైమర్లు పూర్తిగా ధ్వంసం కావడంతో గ్రామాల పరిధిలో ఎక్కడ చూసిన ఇప్పటికి.. 24 గంటల విద్యుత్ లైట్లు వెలుగుతూనే ఉన్నాయి.

బకాయిలు చెల్లించాలని..

జిల్లా వ్యాప్తంగా 384 గ్రామ పంచాయతీలకు గాను రూ.4.68 కోట్లు బకాయిలుగా ఆయా కంపెనీలు చూపిస్తున్నాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. దీంతో తక్షణమే బకాయిలు చెల్లించాలని కంపెనీల నుంచి డిమాండ్ నోటీసులు వస్తున్నాయి. ఈఈసీఎల్, ఎన్ఈడీసీఏపీ కంపెనీలకు సంబంధించి ఒక్క ఈఈసీఎల్ కంపెనీ ప్రతినిధులే మాత్రమే మొత్తం బకాయిలు చెల్లించాలని మండల స్థాయి అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. అయితే ఎన్ఈడీసీఏపీ కంపెనీ మాత్రం కేంద్ర ప్రభుత్వం పరిధిలోనిది కావడంతో బిల్లులపై వారి ఒత్తిడి ఉండకపోవచ్చునని భావిస్తున్నారు. మేజర్ గ్రామ పంచాయితీల్లో సుమారు 600 బల్బులకు పైగా ఏర్పాటు చేశారు. ఒక బల్బుకు వచ్చి మూడు నెలలకు గాను సుమారుగా రూ.145 చెల్లించాలని అధికారులు చెప్తున్నారు. ఉదాహరణకు మేజర్ పంచాయతీ అయితే మూడు నెలలకు గాను రూ.87 వేలకు పైగా ఆయా కంపెనీలకు చెల్లించాల్సి ఉంది. 2021లో ప్రత్యేక అధికారుల పాలనలో సైతం ఎల్ఈడీ బల్బులు నిర్వహణ నిధులు చెల్లించాలని ఒత్తిడి ఉండేదని ఓ అధికారి చెప్పారు. అప్పటి నుండి మళ్లీ ఇప్పుడు ఒత్తిడి పెరిగిందని అంటున్నారు. అయితే కంపెనీలు నిర్వహణను గాలికొదిలేస్తే పంచాయతీలే ఎలాగోలా బల్బుల నిర్వహణ చూసుకునేవని అప్పుడు పట్టించుకోని వారు ఇప్పుడు ఎలా ఒత్తిడి తెస్తున్నారని పంచాయతీ పాలకవర్గాలు, అధికారులు చెబుతున్నారు. ఇన్నాళ్లు తాము బల్బుల నిర్వహణకు పెట్టిన ఖర్చు లెక్క ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయి సంబంధిత అధికారులతో పాటు కంపెనీ ప్రతినిధులు నుంచి బకాయిలు చెల్లించాలని ఫోన్‌లు, మెసేజ్‌లు వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. నిర్వహణ లేనప్పటికి డబ్బులు ఎలా చెల్లిస్తామని ఒకరి ఒకరు చెప్పుకుంటున్నారు. ఈ విచిత్ర పరిణామంతో నిధులు లేక ఖాళీగా ఉన్న పంచాయితీల కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. ఇది ఇలా ఉండగా ప్రభుత్వాలు నుంచి ఆర్థిక సంఘం నిధులు విషయంలో కదలిక వచ్చినప్పుడల్లా ఈ బకాయిలు తెరమీదకు వస్తాయని ఆ సమయంలోనే మండలాలపై ఒత్తిడి వస్తుందని సర్పంచ్‌లు వాపోతున్నారు.

విద్యుత్ బిల్లులనే చెల్లించలేకపోతున్నాం

నాగాబత్తుల శాంతకుమారి, ఉమ్మడి జిల్లా సర్పంచల సంఘం అధ్యక్షురాలు



గడిచిన మూడున్నర ఏళ్లల్లో పంచాయతీలకే ఆర్థిక సంఘం నిధులు రాక అనేక ఇబ్బందులు పడుతున్నాం. పారిశుధ్య పనులను పూర్తిస్థాయిలో నిర్వహించలేక, కరెంటు బిల్లులు చెల్లించలేక పంచాయతీలు ఆర్థిక ఇబ్బందుల్లో సతమతమయ్యాయి. మూడున్నర ఏళ్లుగా వీధి లైట్లు బాధ్యత పూర్తిగా పంచాయతీలే చూసుకుంటున్నాయి. ఎక్కడ ఏ లైటుకు ఇబ్బంది వచ్చినా పంచాయతీ నిధులే వాడుకున్నాం. టైమర్లు సైతం పూర్తిగా ధ్వంసం కావడంతో మాచవరం గ్రామ పంచాయతీలో 68 బాక్స్‌లకు గాను 53 బాక్స్‌ల్లో టైమర్‌లు ఏర్పాటు చేసుకున్నాం.

స్వాతంత్ర్య వేడుకలపై కలెక్టర్ సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా అధికార యంత్రాంగం పూర్తి సమన్వయంతో పనిచేసి స్వాతంత్ర్య వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. త్రివర్ణ పతాక చరిత్ర, ప్రాముఖ్యం, ఇతర నియమాలను విధిగా పాటించాలన్నారు. ప్రభుత్వ శాఖల పరిధిలో విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించిన ఉద్యోగులకు అవార్డులు అందజేస్తామన్నారు. ఒక్కో శాఖ నుంచి ఇద్దరిని మాత్రమే ఎంపిక చేయాలన్నారు. ఎంపిక చేసే ఉద్యోగులపై ఏవిధమైన అపవాదులు లేని వారిని సిఫార్సు చేయాలని సూచించారు. విద్యార్థుల్లో దేశ భక్తిని పెంపొందించేలా వేడుకలు జరగాలన్నారు. కలెక్టరేట్‌లో గురువారం స్వాతంత్ర్య వేడుకల నిర్వహణపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, జిల్లా సమన్వయ కమిటీ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అమలాపురం ఆర్డీవో స్టేజ్ అలంకరణ, గ్యాలరీల ఏర్పాటు వంటివి చేయాలని ఆదేశించారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా పనులు పురపాలక సంఘం చేపట్టాలన్నారు. పోలీసు, ఎన్‌సీసీ విభాగాల గార్డ్ ఆఫ్ ఆనర్, పెరేడ్ నిర్వహణకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం వికసిత్ భారత్ కాన్సెప్ట్‌తో నిర్వహిస్తున్నామని చెప్పారు. అన్న క్యాంటీను నిర్వహణపై ఒక శకటం, ఎన్టీఆర్ సామాజిక భద్రతా పెన్షన్ల పెంపుపై మరో శకటం, ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన సాగు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానం, దేవాలయాలను ప్రతిబింబించేలా శకటాలను రూపొందించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్వాతంత్రోద్యమ ఘట్టాలు, స్వాతంత్ర్య సమర యోధుల పరిచయ కార్యక్రమాలు, ప్లాస్టిక్ వినియోగంపై కలిగే అనర్థాలు, సిపాయిల తిరుగుబాటుపై సాంస్కృతిక కార్యక్రమాలు రూపొందించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్ పాల్గొన్నారు.

గంజాయి సమాచారమిస్తే రూ.5 వేల రివార్డు 7లో
మంత్రి సుభాష్ ప్రకటన

ఆక్వా ముప్పు




అల్లవరం మండలం ఓడలరేవు సముద్ర కెరటాల చెంతనే ఆక్వా చెరువులు

- సీఆర్‌జెడ్ పరిధిలో ఓడలరేవు తీరంలో అక్రమ ఆక్వా సాగు
- అద్దెకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- నేల మీదే విద్యుత్‌తీగలు
- పట్టించుకోని అధికారులు

అధికారుల నిర్లక్ష్యంతో..

అల్లవరం, ఆగస్టు 8: రెవెన్యూ, మత్స్యశాఖ, విద్యుత్‌శాఖల నిర్లక్ష్యం కారణంగా అల్లవరం మండలం ఓడలరేవు, కొమరగిరిపట్నం తీర గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా సముద్రం చెంత సీఆర్‌జెడ్ పరిధిలో అనధికార ఆక్వా సాగు జరుగుతోంది. సముద్ర కెరటాలకు ఆక్వా చెరువుల మధ్య చిన్నగట్టే మిగిలింది. అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా ఆక్వా చెరువులతో ముప్పు పొంచి ఉంది. ఇప్పటికి తీరం వెంబడి రైతు జిరాయితీ భూములతో పాటు సుమారు 450 ఎకరాల అటవీ శాఖ భూములు చాలా వరకు కోతకు గురై మిగిలిన భూములు అన్యాక్రాంతమయ్యాయి. సముద్రతీరంలో కోస్టల్ రెగ్యులైజేషన్ జోన్ (సీఆర్‌జెడ్) పరిధిలో 500 మీటర్ల లోపు ఎటువంటి చెరువులు తవ్వరాదన్న నిబంధనలను తుంగలోకి తొక్కారు. గతంలో పనిచేసిన రెవెన్యూ, మత్స్య, విద్యుత్ శాఖ అధికారుల అలసత్వంతో తీరంలో ఆక్వా చెరువులు తవ్వేయగా అనుమతిలేకున్నా ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చేశారు. సముద్ర తీరం వెంబడి అక్రమ ఆక్వా సాగును అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. అక్రమ సాగుపై దర్యాప్తు చేస్తే ఆయా శాఖల లొసుగులు బయటపడతాయి.



నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

అద్దెకు ట్రాన్స్‌ఫార్మర్లు!

సముద్ర తీరంలో అనుమతులు లేకుండా ఆక్వా చెరువులు తవ్వేస్తే కాసులకు కక్కుర్తిపడి గతంలో విద్యుత్‌శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయించి అయినకాడికి దండుకున్నారు. ఇదే అదునుగా కొందరు తమ ట్రాన్స్‌ఫార్మర్లను పరిధి దాటి 2, 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆక్వా చెరువులకు నెలవారీ అద్దెపై విద్యుత్ సరఫరా చేస్తున్నప్పటికీ ఆ శాఖ చోద్యం చూస్తోంది. కిలోమీటర్ల పొడవునా నేల మీదుగానే ప్రమాదభరితమైన విద్యుత్‌తీగలు వెళ్లాయి. సముద్రం తీరంలో అక్రమ ఆక్వా సాగును విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని అనుమతులు లేని చెరువులను తొలగించేందుకు ప్రత్యేక దర్యాప్తు జరపాలని జిల్లా కలెక్టర్‌కు, ఆశాఖ ఉన్నతాధికారులకు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇలా వదిలేస్తే తీర గ్రామాల ఉనికికే ముప్పు వాటిల్లనుంది.

బడి ఎన్నికలు ప్రశాంతం



బండారులంక జడ్పీ హైస్కూల్ ఎస్ఎంసీ కమిటీ

అమలాపురం టౌన్, ఆగస్టు 8: జిల్లాలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. అక్కడక్కడా స్థానిక ఎన్నికలను తలపించే విధంగా ఓటింగ్ సైతం జరిగింది. ఆయా పాఠశాలల వద్ద ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులు మోహరించారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ముందస్తుగానే సమస్యాత్మక పాఠశాలల వద్ద పోలీసు బందోబస్తు చేయాలని ఆదేశించడంతో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మధ్యాహ్నానికి ఎస్ఎంసీ ఎన్నికల ప్రక్రియ పూర్తయింది. మలికిపురం మండలం గొల్లపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు అంతంతమాత్రంగానే హాజరు కావడంతో కోరం లేక ఎన్నికను వాయిదా వేశారు. 1581 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు పూర్తి అయినట్టు సమగ్ర శిక్షా సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం తెలిపారు.

పాఠశాలల వారీగా ఎస్ఎంసీ ఎన్నికలు..

జిల్లాలో 1273 ప్రాథమిక పాఠశాలలు, 72 ప్రాథమికోన్నత, 237 ఉన్నత పాఠశాలలతో కలిపి 1582 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. 544 ప్రాథమిక, 25 ప్రాథమికోన్నత, 78 ఉన్నత పాఠశాలలతో కలిపి 647 ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఇక 728 ప్రాథమిక, 47 ప్రాథమికోన్నత, 159 ఉన్నత పాఠశాలలతో కలిపి 934 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నిక ఓటింగ్ విధానంలో జరిగింది. ఎన్నికల ప్రక్రియను జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి, ఉపవిద్యాశాఖాధికారి జి.సూర్యప్రకాశం, ఎంపీడీవో జి.మల్లికార్జునరావు తదితరులు పర్యవేక్షించారు.

జ్యోతిర్మయి వ్రతాల నిర్వహణకు అనుమతి రద్దు

అన్నవరం, ఆగస్టు 8: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో గతేడాది కార్తీక మాసంలో జ్యోతిర్మయి వ్రతాలకు అప్పట్లో దేవదాయ కమిషనర్ అనుమతులిచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ తాజాగా ఆదేశాలు వెలువడ్డాయి. ఒక్కో టిక్కెట్టు రూ. 10,116గా నిర్ణయించి సుమారు 4 గంటల పాటు వ్రతం చేపట్టాల్సి ఉంది. అయితే దీనిపై పునఃపరిశీలన చేసి ఈ క్రతువు వ్యయప్రయాసలతో కూడుకున్నదని భక్తుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడంతో దేవదాయ కమిషనర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ వ్రతాలు నిర్వహించే మండపం కోసం అప్పట్లో ఖర్చు చేసిన సుమారు రూ.15 లక్షల వ్యయం బూడిదలో పోసిన పన్నీరైందని భక్తులు ఆవేదన చెందుతున్నారు. ముందుచూపు లేకుండా తీసుకునే నిర్ణయాలతో దేవస్థానం ఖజానాకు నష్టం చేకూరుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సత్యదేవునికి మెడికల్-హెల్త్ చీఫ్ సెక్రటరీ పూజలు



అన్నవరం, ఆగస్టు 8: రత్నగిరివాసుడైన సత్యదేవుని ఏపీ మెడికల్-హెల్త్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేయగా పీఆర్వో కృష్ణారావు స్వామివారి ప్రసాదం అందించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పి.రవికుమార్ పాల్గొన్నారు.

ధగధగాయమానం

సత్యదేవుడి ధ్వజస్తంభానికి స్వర్ణతాపడం పూర్తి

నేడు ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు ప్రదక్షిణకు అనుమతి



అన్నవరం, ఆగస్టు 8: రత్నగిరివాసుడైన సత్యదేవుడి ధ్వజస్తంభ స్వర్ణతాపడం అమరిక పనులను గురువారం ఉదయం ప్రారంభించారు. నెల్లూరుకు చెందిన దాత రూ.3కోట్ల వ్యయంతో చేయించేందుకు ముందుకొచ్చారు. ఏప్రిల్ 22న నార్వేప కర్రతో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరిగింది. అప్పటి నుంచీ దీనికి సంబంధించి రాగి రేకు, దానిపై బంగారు పూత పనులు చేపట్టారు. 300 కిలోల రాగి రేకుపై రెండు కిలోల బంగారంతో స్వర్ణ తాపడం చేయించారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు పండితులు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు చేస్తారు. 10.20 గంటల నుంచి భక్తులకు బంగారు ధ్వజస్తంభం చుట్టూ ప్రదక్షిణ చేసేందుకు అనుమతి ఇస్తారు. కార్యక్రమంలో దాత దంపతులు, ఇన్‌చార్జి ఈవో రమేష్‌బాబు పాల్గొంటారు.



ఆదివాసీల సంక్షేమం



ఎండమావేనా!

ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన వర్గీకరణ తీర్పు తద్వారా సంపన్న శ్రేణి మినహాయింపు ఆయా జాతుల అభివృద్ధి, సంక్షేమాలకు సూచికలు కాగలవేమో కానీ ఆదివాసీల మనుగడకు అవసరమైన హక్కులు, సాధికారతను కల్పించలేకపోతోంది. ఆదివాసీల అభివృద్ధికి, సంక్షేమానికి బ్రిటిష్ కాలం నుంచీ ఎన్ని ప్రణాళికలు, శాసనాలు అమలవుతున్నా వారి జీవన ప్రమాణాలను పెంచాల్సిన ప్రభుత్వ పాలకులు, అధికారులే వారి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న వనరులపై వారికి సంపూర్ణ హక్కులు వారి మనుగడకు, వికాసానికి దోహదపడట్లేదు. ఒక్కోమారు వారికి ఉన్న హక్కులను ప్రభుత్వాలను నడిపించే పాలకులే హరించేస్తున్నారు. అభివృద్ధి ముసుగులో కొన్ని విధానాలు ఆదివాసీల ఉనికినే లేకుండా చేస్తున్నాయి. సంస్కృతీ, సంప్రదాయాలకు తిలోదకాలనిస్తున్నారు. ప్రాజెక్టుల పేరుతో ఆదివాసీల ఐక్యతను దెబ్బతీస్తూ, జాతి అంతానికే దారితీసే నిర్ణయాలను ప్రభుత్వాలు తీసుకుంటున్నాయి. ఆదివాసీ మహిళలకు కనీస ఆస్తి హక్కు కూడా గత 77 సంవత్సరాలుగా కలగలేదు. పాలకులు ఎవరు మారినా అధికార యంత్రాంగం తీరులో మార్పు లేకపోవడంతో ఆదివాసీ సంక్షేమం ఎండమావిగానే ఉంది

వారి మనుగడకు వర్గీకరణకు మించిన సాధికారత కావాలి

హక్కుల రక్షణను విస్మరించిన పాలకులతో తిరోగమనంలో జీవనం

(రంపచోడవరం)

ఆదివాసీల జీవన ప్రమాణాలు నానాటికీ దిగజారిపోతున్నాయి. ఎటువంటి మౌలిక సదుపాయాలు లేని కాలంలో ఎంతో ఆదర్శప్రాయమైన జీవనాన్ని సాగించిన గిరిజన జాతులు నేడు ఎన్నో, సామాజిక, ఆర్థిక, రాజకీయ ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. అడవిని నమ్ముకుని జీవనం సాగించే వీరికి నేటికీ అటవీ హక్కులు పూర్తిస్థాయిలో దక్కలేదు. కానీ ఆదివాసీలకు చెందాల్సిన వనరులను వారి ప్రమేయం లేకుండా అమ్ముకుని, ఖనిజాలు దోచేసే వ్యవస్థలకు ప్రోత్సాహం ఎక్కువైంది. విధాన లోపం, అమలు చేసేవారిలో చిత్తశుద్ధి లోపం గిరిజనులకు శాపంగా మారింది. ఇక్కడి వనరుల ఆధారంగా జరిగే వాణిజ్య వ్యవహారాల్లో ఆదివాసీలను భాగస్వాములుగా చేసి వారికి కూడా ఆర్థికాభివృద్ధి సాధించిపెట్టే వ్యూహాలు అమలుకు నోచుకోవట్లేదు. ఆహార, ఆరోగ్య భద్రతలు మృగ్యమయ్యాయి. ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లాలోనే సుమారు 420 ఆవాసాలకు సకాలంలో అత్యవసర వైద్య సేవలు పొందే అవకాశం లేదు. సుమారు 502 ఆవాసాలకు సరైన రహదారి బంధాలు లేవు. ఈ జిల్లాలో మూడు ఐటీడీఏలు ఏర్పాట చేసిన లక్ష్యం నీరుగారి నిర్దేశించిన ఆశయాల్లో గత 48 సంవత్సరాలుగా ఏ ఒక్క దానినీ అవి సాధించకపోగా అవినీతికి నిలయాలుగా మారాయి. గిరిజనుల పేరుతో చేపట్టాల్సిన పథకాలను, కార్యక్రమాలను అధికారులు, రాజకీయ నాయకులు తమ జేబులు నింపుకునే కార్యక్రమాలుగా మార్చారు. ఎన్ని విచారణలు జరిగి, ప్రభుత్వానికి ఎన్ని నివేదికలు అందినా బాధ్యులపై చర్యలు మృగ్యమే! దీంతో గిరిజన ప్రాంతం అవినీతిపరులకు అడ్డాగా మారింది. గిరిజనాభివృద్ధిని నిర్దేశించే సమావేశాలు మూడేళ్లుగా ఐటీడీఏల్లో జరగడం లేదు. ముఖ్యంగా ఈ ప్రాంతాల్లో రాజకీయ చైతన్యం అంతగా లేకపోవడంతో బ్యూరోక్రాట్లే పెత్తనం సాగిస్తూ గిరిజన మనుగడను దెబ్బతీస్తున్నారు. గిరిజనులను భాగస్వామ్యం చేసి ప్రణాళికలను రూపొందించాలన్న అంశాన్నే విస్మరించారు. ఐటీడీఏలో మెజారిటీ సభ్యులందరూ అధికారులే కావడం విశేషం. జవాబుదారీతనం కలిగిన వ్యవస్థగా గిరిజనుడే ఛైర్మన్‌గా, పెద్ద సంఖ్యలో గిరిజనులే సభ్యులుగా ఐటీడీఏను రూపొందించం ద్వారా గిరిజనుల్లో నాయకత్వ లక్షణాలు పెరిగి ఈ ప్రాంత ప్రయోజనాల రక్షణకు వీలుంటుంది.

జలాలను సద్వినియోగపర్చే దిశగా సాగాల్సిన జలయజ్ఞాలు ధనయజ్ఞాలుగా మారి గిరిజన ప్రయోజనాలను దెబ్బతీసిన పరిస్థితులు అందరికీ తెలిసినవే! ఇక పోలవరం లాంటి మెగా ప్రాజెక్టు విషయంలో గత రెండు దశాబ్దాలుగా సరైన పునరావాస విధానాన్ని ప్రభుత్వాలు చేపట్టకపోవడంతో ఒక్క అల్లూరి జిల్లాలోనే సుమారు 236 ఆవాసాల గిరిజనుల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. ఈ పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాలలో ఆదివాసీలకు ఉన్న అటవీ హక్కులను పరిరక్షించాలని కేంద్రం గతంలోనే ఆదేశించినా ఇప్పటికీ అటవీ హక్కులు వారికి దక్కలేదు. ప్రాజెక్టు కారణంగా ఆదిమజాతిలో ముఖ్యమైన కొండరెడ్లు అధికంగా ఉండే గోదావరి తీర గ్రామాల నుంచి వారిని తొలగించేందుకు రంగం సిద్ధమైంది.

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ఇక ఆదివాసీలు సాధికారత సాధించే దిశగా తీసుకుంటున్న చర్యలే ఎక్కడా కనిపించట్లేదు. 73వ రాజ్యాంగ సవరణలోని అంశాలకు ఈ ప్రాంతంలోని అధికారులు విలువ ఇవ్వట్లేదు. అధికారులు తీసుకునే ఏ నిర్ణయం కూడా పీసా చట్టం కింద సాగడం లేదు. గిరిజన మహిళలకు సమాన ఆస్తి హక్కు కల్పించే దిశగా కూడా ప్రభుత్వాలు చర్యలు తీసుకోలేదు. దీంతో గిరిజన కుటుంబాల మధ్య ఆస్తి హక్కుల విషయాల్లో అనేక వివాదాలు కొనసాగుతున్నాయి. భవిష్యత్తులోనైనా ప్రభుత్వాలు గిరిజన సాధికారిత కోసం చర్యలు తీసుకుని, వారి మనుగడ కోసం కృషి చేస్తాయేమో చూడాలి.



అర్ధరాత్రి హాహాకారాలు

దివాన్‌చెరువు హైవేపై అదుపుతప్పిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. ప్రయాణికులు సురక్షితం

రాజమహేంద్రవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు హైవేపై దూసుకుపోతోంది.. సరిగ్గా అర్ధరాత్రి 1.30 సమయం.. వర్షం కురుస్తోంది.. దాదాపుగా అందరూ గాఢ నిద్రలో ఉన్నారు.. ఈలోపు పెద్ద కుదుపు.. బస్సు అదుపు తప్పింది.. ప్రయాణికుల హాహాకారాలు.. అదృష్టవశాత్తూ ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కేవీఆర్ ట్రావెల్స్‌కి చెందిన బస్సు గుంటూరు నుంచి పాలకొండ వెళ్తోంది. వర్షం పడుతుండడంతో రోడ్డు చిత్తడిగా మారింది. దివాన్‌చెరువు సమీపంలో హైవేపైకి చేరే మలుపు వద్ద బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు తుప్పల్లోకి వెళ్లింది. డ్రైవరు అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న సౌత్‌జోన్ డీఎస్పీ అంబికాప్రసాద్, ధవళేశ్వరం సీఐ వి.వినయ్‌మోహన్, ప్రకాశ్‌నగర్ ఎస్ఐ శివప్రసాద్, రోడ్ సేఫ్టీ మొబైల్ సిబ్బంది ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. కేవీఆర్ ట్రావెల్స్ స్థానిక కార్యాలయం నుంచి కూడా సిబ్బంది వచ్చారు. 40మంది ప్రయాణికులను జాగ్రత్తగా కిందికి దింపి వేరే బస్సులో పంపించారు.

విజిలెన్స్ దాడుల్లో 33.27 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

పిఠాపురం, ఆగస్టు 8: కాకినాడ పిఠాపురంలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని బొజ్జావారితోట ఏరియాలో పాడుబడి వినియోగంలో లేని ఇంటిలో రేషన్ బియ్యాన్ని నిల్వ చేసినట్లు అందిన సమాచారంతో తనిఖీలు చేపట్టారు. అక్కడ 65 బస్తాల్లో ఉన్న 33.27 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా నిల్వ ఉంచిన ఊటా బుల్లిరాజుపై పిఠాపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. పట్టుబడిన రేషన్ బియ్యం విలువ రూ.1.54లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ టి.జగన్నాథరెడ్డి, ఏవో జి.భార్గవమహేష్, డీసీటీవో నవీన్‌కుమార్, పీసీలు జీవీఎస్ లోవరాజు, కె.వీరబాబు, సివిల్ సప్లయిస్ డీటీ వీరాస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రేషన్‌బియ్యం క్రయ, విక్రయాలు జరిపినా, అక్రమంగా నిల్వ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పిఠాపురంలో విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

శతాధిక వృద్ధుడి మృతి



పెరవలి, ఆగస్టు 8: తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం ఉసులమర్రు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు ఉప్పలపాటి సుబ్బారావు (102) గురువారం మృతి చెందారు. ఆయనకు భార్య రామలక్ష్మి, ఒక కుమారుడు సత్తిరాజు, నలుగురు కుమార్తెలు, 11 మంది మనుమలు, 18 మంది మునిమనుమలు ఉన్నారు. గ్రామానికి మంచినీటి సౌకర్యం లేని రోజుల్లో సుబ్బారావు చెరువును తవ్వించడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారని గ్రామస్తులు తెలిపారు. ఆయన మృతికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు, టీడీపీ, జనసేన నాయకులు సంతాపం తెలిపారు.

తిరుమల ఎక్స్‌ప్రెస్ రద్దుపై ప్రయాణికుల అసహనం

సామర్లకోట, ఆగస్టు 8: విశాఖ-తిరుపతి మధ్య నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 10వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్టు రైల్వే అధికారులు అర్ధంతరంగా ప్రకటించడంతో సాధారణ ప్రయాణికులతో పాటు తిరుపతి వెళ్లేందుకు ముందుగా రిజర్వేషన్ చేయించుకున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రిజర్వేషన్ టిక్కెట్లకు సొమ్ము రిఫండ్ పొందేందుకు సరియైన సమాచారం చెప్పే రైల్వే అధికారులు లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని సామర్లకోట రైల్వే ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లగా రిజర్వేషన్ టిక్కెట్లకు సంబంధించిన సొమ్మును వెనక్కి ఇస్తామని చెప్పారు.

గంజాయి సమాచారం ఇస్తే రూ.5వేలు రివార్డు

మంత్రి సుభాష్ ప్రకటన

రామచంద్రపురం (ద్రాక్షారామ), ఆగస్టు 8: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా గంజాయి సరఫరా, వినియోగించే వారి సమాచారం ఇస్తే వారికి రూ.5వేలు ఇస్తామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రకటించారు. పరిశ్రమలు, కళాశాలలు, పాఠశాలలు, బహిరంగ ప్రదేశాల్లో గంజాయి అమ్మేవారు, తాగేవారి వివరాలను తనకు గానీ, పోలీసులకు గానీ తెలియజేసే వారికి నగదు రివార్డు ఇస్తామన్నారు. సమాచారం ఇచ్చిన లేదా పట్టిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. గంజాయి సరఫరా, వినియోగాన్ని అరికట్టేందుకు అందరూ సహకరించాలని మంత్రి కోరారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

మలికిపురం, ఆగస్టు 8: గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న అప్పనరామునిలంకకు చెందిన మిరియాల బన్నును గురువారం మలికిపురం మసీదు రోడ్డులో అరెస్టు చేసి కోర్టుకు పంపినట్టు ఎస్ఐ పి.సురేష్ తెలిపారు. ఎవరైనా గంజాయి తాగినా, అమ్మినా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.





గుర్తు తెలియని జంతువు దాడిలో మృతి చెందిన దూడ, జంతువు పాదముద్రలు

గుర్తు తెలియని జంతువు దాడిలో లేగదూడ మృతి

గండేపల్లి, ఆగస్టు 8: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన వల్లభశెట్టి సత్తిబాబుకి ఎన్టీ రాజాపురం సమీపంలో దూళ్ల సావిడి వుంది. అతడు గురువారం ఉదయాన్నే పాలు తీసుకుని తిరిగి వచ్చేసరికి చనిపోయి సగం తినేసి ఉన్న దూడను చూసి భయపడ్డాడు. ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు తెలపగా ఫారెస్టు ఆఫీసరు పాలకు శశికుమార్ వచ్చి పాదముద్రలు గుర్తించారు. వీటిని ఉన్నతాధికారులకు పంపిస్తామని, ఏ జంతువో చెప్పలేమన్నారు. రేసు కుక్కలు లేదా చిరుత అయి ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అదే ప్రాంతంలో కొంతకాలం క్రితం మల్లేపల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి బుల్లబ్బాయి లేగదూడను గుర్తు తెలియని జంతువు ఇదే మాదిరిగా తినేయడంతో పాటు ఒక గేదెపై దాడి చేసిన సంఘటనలున్నాయి. అప్పట్లో అటవీ శాఖాధికారులు అందుకు కారణం రేసు కుక్కలు అయి ఉండవచ్చని భావించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. తాజాగా జరిగిన ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.46/బి, రాజమహేంద్రవరం

ఎన్నికల మహాజన సభ నోటీసు

(ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల నియమావళి 1964లోని నియమము-22(3)(ఎ) ప్రకారము)

ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ నెం.46/బి, రాజమహేంద్రవరం యొక్క నూతన పాలకవర్గ సభ్యుల ఎన్నిక జరపవలసియున్నది. ఈ ఎన్నికల ప్రక్రియ కొరకు ది.25-8-2024 ఆదివారం ఉదయం 8 గం॥ నుండి సాయంత్రం 4గం॥ల వరకు లోకల్ నియోజకవర్గము(1)కు సంబంధించిన బ్రాంచీలు అనగా 1. జాంపేట మెయిన్ బ్రాంచ్ 2. మోరంపూడి 3. ధవళేశ్వరం మరియు 4. సీతంపేట బ్రాంచీలకు సంబంధించి ఎన్నిక మహాజన సభ 1. ఎస్.కె.వి.టి ఇంగ్లీషు మీడియం హైస్కూల్, దానవాయిపేట, రాజమహేంద్రవరం 2. ఎస్.కె.వి.టి. డిగ్రీ కళాశాల (వై.జంక్షన్), రాజమహేంద్రవరం 3. చున్నీలాల్ జాజూ రోటరీ మున్సిపల్ కార్పోరేషన్ హైస్కూల్ కంబాలపేట, వై.జంక్షన్ దగ్గర రాజమహేంద్రవరం 4. జాంపేట బాలికల మున్సిపల్ కార్పోరేషన్ ఎలిమెంటరీ స్కూల్, జాంపేట, జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ప్రక్కన రాజమహేంద్రవరం (జాంపేట మెయిన్ బ్రాంచి సభ్యులకు) 5. దానవాయిపేట మున్సిపల్ హైస్కూల్ దానవాయిపేట, రాజమహేంద్రవరం (మోరంపూడి బ్రాంచి సభ్యులకు) 6. ధవళేశ్వరం జెడ్.పి.పి.బాలికల హైస్కూల్, ధవళేశ్వరం (ధవళేశ్వరం బ్రాంచి సభ్యులకు) 7. సి.జి.టి.యం.ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లలితానగర్ రాజమహేంద్రవరం (సీతంపేట బ్రాంచి సభ్యులకు)ల నందు జరుపుటకు మరియు **నాన్‌లోకల్ నియోజకవర్గము(2)కు** సంబంధించిన బ్రాంచీలు అనగా అనపర్తి, గోకవరం, మరియు **నాన్ లోకల్ నియోజకవర్గం (3)కు** సంబంధించిన బ్రాంచీలు పెద్దాపురం, కాకినాడ లకు సదరు బ్రాంచ్ ఆవరణలలో మరియు ఏలూరు, కొవ్వూరు బ్రాంచి సభ్యులకు ఏలూరు బ్రాంచి నందు ఎన్నికల మహాజన సభ జరుపుటకు నిర్ణయించడమైనది. కావున ఓటు హక్కు కలిగిన యావన్మంది సభ్యులు తమ పాలకవర్గ సభ్యులను ఎన్నుకొను నిమిత్తం ఎన్నికల మహాజన సభకు హాజరు కావలసినదిగా కోరడమైనది. సదరు ఎన్నికల మహాజన సభకు హాజరగు సభ్యులు బ్యాంకు వారిచే ఇవ్వబడిన తమ ఫొటో గుర్తింపు కార్డుతో హాజరు కావలసినదిగా కోరడమైనది.

సం/- యం.జగన్నాథ రెడ్డి, డివిజనల్ కోపరేటివ్ ఆఫీసర్, రాజమహేంద్రవరం మరియు ఎన్నికల అధికారి
ది.జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.46/బి, రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం, తేది.09.08.2024

ఎన్నికల ప్రకటన

ది.జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.46/బి, రాజమహేంద్రవరం

ఫారము-1

తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం అర్బన్ మండలంలోని ది.జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.46/బి, రాజమహేంద్రవరం యొక్క పాలకవర్గమునకు ది.25-08-2024 తేదీ ఆదివారం ఎన్నికలు నిర్వహించుటకు జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధారిటీ తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం వారు నన్ను ఎన్నికల అధికారిగా నియమించినారు.

ఎన్నికల కార్యక్రమము ఈ క్రింది విధంగా ఉంటుంది.

1) బ్యాంకు పేరు, రిజిస్టర్ నెం : ది. జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.46/బి, రాజమహేంద్రవరం
2) ఎన్నికల విధానం : రహస్య బ్యాలెట్
3) మొత్తము ఎన్నికల జరుగు స్థానములు మరియు ఎస్.సి/ ఎస్.టి./బి.సి/ మరియు స్త్రీలు/ ఇతరులకు కేటాయింపు ఏమైనా ఉన్నచో : 12 (పన్నెండు) ఎట్టి రిజర్వేషన్లు లేవు
4) నియోజకవర్గముల సంఖ్య : 3

నియోజకవర్గము -1 (లోకల్)

బ్రాంచి పేర్లు	ఓటర్ల జాబిత క్రమ సంఖ్య నుండి	ఓటర్ల జాబిత క్రమ సంఖ్య వరకు	ఓటర్ల అడ్మిన్ నెం. నుండి	ఓటర్ల అడ్మిన్ నెం. వరకు	ఎన్నికలు జరుగు స్థానములు
1. జాంపేట మెయిన్ బ్రాంచి	1	15623	3	32137	10 (పది)
2. మోరంపూడి బ్రాంచి	15624	17765	4153	32135	
3. ధవళేశ్వరం బ్రాంచి	17766	20986	14687	32139	
4. సీతంపేట బ్రాంచి	20987	23752	4561	32122	

నియోజకవర్గము -2 (నాన్ లోకల్)

బ్రాంచి పేర్లు	ఓటర్ల జాబిత క్రమ సంఖ్య నుండి	ఓటర్ల జాబిత క్రమ సంఖ్య వరకు	ఓటర్ల అడ్మిన్ నెం. నుండి	ఓటర్ల అడ్మిన్ నెం. వరకు	ఎన్నికలు జరుగు స్థానములు
1. అనపర్తి బ్రాంచి	1	963	19639	32132	1 (ఒకటి)
2. గోకవరం బ్రాంచి	964	1901	21564	32089	

నియోజకవర్గము -3 (నాన్ లోకల్)

బ్రాంచి పేర్లు	ఓటర్ల జాబిత క్రమ సంఖ్య నుండి	ఓటర్ల జాబిత క్రమ సంఖ్య వరకు	ఓటర్ల అడ్మిన్ నెం. నుండి	ఓటర్ల అడ్మిన్ నెం. వరకు	ఎన్నికలు జరుగు స్థానములు
1. పెద్దాపురం బ్రాంచి	1	757	20000	32004	1 (ఒకటి)
2. కాకినాడ బ్రాంచి	758	1591	21176	32046	
3. ఏలూరు బ్రాంచి	1592	2064	22814	32044	
4. కొవ్వూరు బ్రాంచి	2065	2071	31844	32105	

5) పోలింగ్ జరుగు తేది, సమయము మరియు ప్రదేశము (పోటీ అనివార్యమైనపుడు) : ది 25-08-2024 ఆదివారం ఉదయం 8 గం॥ల నుండి సాయంత్రం 4 గం॥ల వరకు

నియోజకవర్గము -1 (లోకల్)

బ్రాంచి పేర్లు	ఎన్నికల జరుగు స్థలము
1. జాంపేట మెయిన్ బ్రాంచి	1. ఎస్.కె.వి.టి. ఇంగ్లీషు మీడియం హైస్కూల్, దానవాయిపేట, రాజమహేంద్రవరం. 2. ఎస్.కె.వి.టి. డిగ్రీ కళాశాల (వై. జంక్షన్) రాజమహేంద్రవరం. 3. చున్నీలాల్ జాజూ రోటరీ మున్సిపల్ కార్పోరేషన్ హైస్కూల్, కంబాలపేట, రాజమహేంద్రవరం. 4. జాంపేట బాలికల మున్సిపల్ కార్పోరేషన్ ఎలిమెంటరీ స్కూల్ జాంపేట, రాజమహేంద్రవరం.
2. మోరంపూడి బ్రాంచి	దానవాయిపేట మున్సిపల్ హైస్కూల్ దానవాయిపేట, రాజమహేంద్రవరం.
3. ధవళేశ్వరం బ్రాంచి	జెడ్.పి.పి బాలికల హైస్కూల్, ధవళేశ్వరం.
4. సీతంపేట బ్రాంచి	సి.జి.టి.యం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లలితా నగర్ రాజమహేంద్రవరం.

నియోజకవర్గము -2 (నాన్ లోకల్)

బ్రాంచి పేర్లు	ఎన్నికల జరుగు స్థలము
1. అనపర్తి బ్రాంచి	ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి., అనపర్తి డోర్ నెం: 6-276, పంచాయితీ ఆఫీసు ప్రక్కన, శేషగిరిరావు పేట, అనపర్తి.
2. గోకవరం బ్రాంచి	ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి., గోకవరం డోర్ నెం: 8-86, లారీ ఓనర్స్ అసోసియేషన్ బిల్డింగ్, మెయిన్ రోడ్డు, గోకవరం.

నియోజకవర్గము -3 (నాన్ లోకల్)

బ్రాంచి పేర్లు	ఎన్నికల జరుగు స్థలము
1. పెద్దాపురం బ్రాంచి	ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి., పెద్దాపురం డోర్ నెం: 16-12-49, పాత గవర్నమెంట్ హాస్పటల్ వీధి, పెద్దాపురం.
2. కాకినాడ బ్రాంచి	ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి., కాకినాడ డోర్ నెం: 70-3-2, ఆర్టీసీ కాలనీ రోడ్డు, రమణయ్యపేట, సర్పవరం జంక్షన్, కాకినాడ.
3. ఏలూరు బ్రాంచి మరియు కొవ్వూరు బ్రాంచి	ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి., ఏలూరు డోర్ నెం: 23ఎ-9-10, శంకరమఠం వీధి, ఆర్.ఆర్.పేట, ఏలూరు.

6. నామినేషన్ల స్వీకరణ తేది, సమయం ప్రదేశము (షె.కులము రూ 200/-, షె తగలు రూ.200/- వెనుకబడిన తరగతులు రూ. 400/- ఇతరులు రూ 1000/- నామినేషన్ రుసుముగా చెల్లించాలి) : ది.16-08-2024 శుక్రవారం ఉ.11గం.ల నుండి సా.5 గం.ల వరకు బ్యాంక్ ప్రధాన కార్యాలయం ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్, రాజమహేంద్రవరం, జాంపేట
7. నామినేషన్ల పరిశీలన తేది సమయము మరియు ప్రదేశము : ది.17-08-2024 శనివారం ఉ.11గం.ల నుండి సా॥ 5గం॥లకు బ్యాంకు ప్రధాన కార్యాలయం, ది.జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లి, రాజమహేంద్రవరం, జాంపేట
8. నామినేషన్ల ఉపసంహరణ తేది సమయము మరియు ప్రదేశము : ది.18-08-2024 ఆదివారం ఉ.11 గం.ల నుండి సా.5 గం. వరకు బ్యాంకు ప్రధాన కార్యాలయం, ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లి, రాజమహేంద్రవరం, జాంపేట.
9. పోటీ దారులకు గుర్తుల కేటాయింపు : ది.18.08.2024 ఆదివారం సా.5గం॥ల తరువాత బ్యాంక్ ప్రధాన కార్యాలయం ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లి., రాజమహేంద్రవరం, జాంపేట
10. ఎన్నికలు జరుగు తేది : ది.25.08.2024 ఆదివారం ఉదయం 8గం.ల నుండి సాయంత్రం 4 గం.లకు వరకు
11. ఓట్లు లెక్కింపు జరుగు తేది సమయము మరియు ప్రదేశము : ది.26-8-2024 సోమవారం ఉ.8 గం.ల నుండి ఎస్.కె.వి.టి.డిగ్రీ కళాశాల (వై.జంక్షన్), రాజమహేంద్రవరం
12. ఎన్నికల ఫలితములను ప్రకటించు తేది, సమయము మరియు ప్రదేశము : ది.26-08-2024 సోమవారం కౌంటింగ్ పూర్తయిన పిదప, ఎస్.కె.వి.టి.డిగ్రీ కళాశాల (వై.జంక్షన్) రాజమహేంద్రవరం
13. ఆఫీస్ బేరర్ల ఎన్నిక, పాలక మండలిలో భర్తీ కాని స్థానములను మరియు ఖాళీలగు స్థానములను కో-ఆప్షన్ ద్వారా భర్తీ చేయుట : ది.27-08-2024 మంగళవారం ఉ.8గం.ల నుండి ప్రధాన కార్యాలయం, ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన బ్యాంక్ లి., రాజమహేంద్రవరం, జాంపేట.

గమనిక:
i) నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికయినచో ది.18-08-2024 సాయంత్రం 5గం.ల తరువాత ఫలితాలు ప్రకటించబడును మరియు ఆఫీసు బేరర్ల ఎన్నిక ది.19-08-2024వ తేదీన ఉదయం 8 గం.ల నుండి ప్రధాన కార్యాలయం నందు జరుపబడును.
ii) బ్యాంక్ సభ్యులు బ్యాంకు యొక్క బ్రాంచిల నందు గల నోటీసు బోర్డులో ఉంచబడిన ఓటింగ్‌కు అర్హత గల సభ్యుల జాబితాను పరిశీలించు కోవచ్చును.

సం/- **యం.జగన్నాథరెడ్డి**
డివిజనల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్, రాజమహేంద్రవరం మరియు ఎన్నికల అధికారి
ది.జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ నెం.46/బి, రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం
తేది.09-08-2024

మినీ గోకులాల నిర్మాణానికి దరఖాస్తు తీసుకోవాలి

అల్లవరం, ఆగస్టు 8: మినీగోకుల నిర్మాణానికి అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ పథకానికి కావాల్సిన నకళ్లతో పాటు వైద్యాధికారి ధ్రువీకరణ చేయించాలన్నారు. ఉపాధి హామీ ఏపీవో వి.శ్రీనుబాబు, అనిల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా విద్యాకమిటీ ఎన్నికలు


భీమనపల్లి హైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ చిన్నాను అభినందిస్తున్న నాయకులు

పి.గన్నవరం, ఆగస్టు 8: జిల్లాలో విద్యాకమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. సాధారణ ఎన్నికలను తలపించాయి. చాలాచోట్ల విద్యాకమిటీ ఎన్నికల్లో కూటమి నాయకులు సూచించిన అభ్యర్థులే ఎక్కువ శాతం చైర్మన్‌లుగా ఎన్నికయ్యారు. పి. గన్నవరం మండలం ఆర్.ఏనుగుపల్లిలో స్థానిక, సాధారణ ఎన్నికలు అప్పుడే వచ్చేశాయా అన్నట్టు విద్యాకమిటీ ఎన్నిక జరిగింది. నాయకులు మధ్య సయోధ్య కుదరకపోవడంతో చైర్మన్ ఎన్నిక రసవత్తరంగా మారింది. ఓటుకు నోటుతో పాటు గిఫ్ట్ కూడా పంచినట్లు పలువురు చెప్పుకుంటున్నారు. విద్యాకమిటీ ఎన్నికలను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ప్రత్యేక ఆంక్షలు విధిస్తూ ప్రకటన విడుదల చేశారు. ఈక్రమంలోనే ఎస్ఐ బి.శివకృష్ణ తన సిబ్బందితో హైస్కూలు వద్దకు చేరుకుని అప్పటికే పెద్దఎత్తున చేరుకున్న రెండువర్గాలను చెదరగొట్టారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎంఈవో కె.హెలీనా ఆధ్వ ర్యంలో ప్రధానోపాధ్యాయుడు బి.చిరంజీవిరావు పర్యవేక్షణలో నిర్వహించిన చైర్మన్ ఎన్నికలో వై.కొత్తపల్లి గ్రామానికి చెందిన మట్టపర్తి పద్మరాజు చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల వ్యాప్తంగా జరిగిన విద్యాకమిటీ ఎన్నికల్లో కూటమి నాయకులు సూచించిన అభ్యర్థులే ఎక్కువశాతం చైర్మన్‌లుగా ఎన్నికైనట్లు తెలిసింది. మండల వ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో 69 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలకు గాను 47 చోట్ల ఏకగ్రీవంగాను, 22 చోట్ల ఎన్నికలు నిర్వహించినట్లు ఎంఈవో కె.హెలీనా తెలిపారు. జనసేన క్యాంపు కార్యాలయం వద్ద కూటమి పార్టీలకు చెందిన పలువురు విద్యాకమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఘనంగా సత్కరించారు. సర్పంచ్‌లు నూకపె య్యి ప్రసన్నకుమార్, బి.నాగమణి, కొంబత్తుల ఏసు, నాయకులు సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, తాటికా యల శ్రీనివాసరావు, గుత్తుల రామకృష్ణ, కేదాశి చిన్న, చీకట్ల అర్జు నరావు, పెచ్చెట్టి వీరవెంకటసత్యనారాయణ, కడలి శంకరం, ఎస్.రఘు, సీఆర్ఎంటీ ఎం.అర్జున్, ఎస్.శేషయ్య పాల్గొన్నారు.

అమలాపురం రూరల్ : అమలాపురం మండల విద్యాశాఖ పరిధిలోని 106 పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్టు ఎంఈవో సరెళ్ల దుర్గాదేవి తెలిపారు. ఎన్నికలను ఉప విద్యాశాఖాధికారి జి.సూర్యప్రకాశం పర్యవేక్షించారు. 86 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత, 16 ఉన్నత పాఠశాలల్లో ఎన్నికల అనంతరం కమిటీ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించి తొలి సమావేశాలు నిర్వహించినట్టు ఎంఈవో తెలిపారు.

అంబాజీపేట: అంబాజీపేట, తొండవరం జిల్లా పరిషత్ పాఠశాలలో హోరాహోరీగా ఎన్నికలు జరిగాయి. 9 హైస్కూల్స్‌లో 2 స్కూల్స్‌లో ఎన్నికలు ఏకగ్రీవంగా కాగా, మిగిలిన 7 హైస్కూల్స్ లో ఎన్నికలు జరిగాయి. మండలంలోని 55 ప్రాథమిక పాఠశాలలకుగాను 35 పాఠశాలలో ఏకగ్రీవంగాను, 20 ప్రాథమిక పాఠశాలలో ఎన్నికలు జరిగాయి. కూటమినేతలు, ప్రజాప్రతినిధులు చైర్మన్,వైస్‌చైర్మన్,సభ్యులను సత్కరించారు.

కె.గంగవరం: మండలంలోని 62 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత, 10 ఉన్నత పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. వీటిలో దంగేరు, కుందూరు ఉన్నత పాఠశాలల్లో మినహా మిగిలిన పాఠశాలల్లో ఏకగ్రీవంగా కమిటీలు ఎన్నికయ్యాయి. ఆయా పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాలు ఎంఈవో1 ఏ. నాగరాజు, ఎంఈవో2 చోడిశెట్టి ఆంజనేయులు పర్యవేక్షించారు.

ముమ్మిడివరం: మండలంలో 66 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత, 10 జడ్పీ ఉన్నత పాఠశాలలకు సంబంధించి నిర్వహించిన స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్టు ఎంఈవో బొజ్జా రమణశ్రీ తెలిపారు. ఎస్ఎస్ఏ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.మధుసూదనరావు, కమ్యూనిటీ మోనటరింగ్ అధికారి జీవీ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో కె. నరసింహారావు, ఎంఈవో-2 ఆర్.ఉదయభాస్కరరావులు స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను పర్యవేక్షించారు.


ఆత్రేయపురం: ర్యాలి జడ్పీ హైస్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్న దృశ్యం

మామిడికుదురు: మండలంలోని 72 పాఠశాలలకు ఎన్నికలు నిర్వహించగా 71 పాఠశాలలకు నూతన కమిటీలను ఎన్నుకున్నారు. కొమరాడలోని మండల ప్రజాపరిషత్ స్కూలులో విద్యార్థులు లేకపోవడంతో అక్కడ ఎన్నికలు నిర్వహించలేదని ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబులు తెలిపారు. ఎక్కువ చోట్ల కూటమి బలపరిచిన వారే చైర్మన్లుగా ఎన్నికైనట్టు కూటమి నాయకులు తెలిపారు.

రాయవరం: మండలంలోని 33 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలల్లో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎంఈవో1 పి.రామలక్ష్మణమూర్తి, ఎంఈవో 2 వై. సూర్యనారాయణ పర్యవేక్షణలో జరిగాయి.

మలికిపురం: మలికిపురం మండలంలో గురువారం విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్టు మలికిపురం ఎంఈవో ఎం.విజయశ్రీ తెలిపారు. మండలంలో 78 పాఠశాలలకుగాను 77 పాఠశాలలకు ఎన్నికలు జరిగాయన్నారు. గొల్లపాలెం ప్రైమరీ పాఠశాలలో ఎన్నికలు నిలిచిపోయినట్టు తెలిపారు.

అంతర్వేది: సఖినేటిపల్లి మండలంలో శాంతియుతంగా ఎస్ఎంసీ ఎన్నికలు గురువారం నిర్వహించారు. ప్రైమరీ పాఠశాలలు 63, యూపీ స్కూలు 1, హైస్కూళ్లు 15 కాగా మొత్తం మండల వ్యాప్తంగా 79 పాఠశాలల్లో ప్రశాంతంగా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు జరిగాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, మాజీ సర్పంచ్ పోతురాజు నాగేంద్రకుమార్, హెచ్ఎం సోమసూర్యకుమారి, కోలా వీరాస్వామి, సీఆర్పీ కిశోర్, పడాల సోమశంకర్, పోతురాజు వెంకటరత్నం, అడబాల శ్రీను, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం : మండలంలో 37 ప్రాథమిక, 6 ప్రాథమికోన్నత, 8ఉన్నత పాఠశాలల్లో మొత్తం 51 పాఠశాలల్లో ఎన్నికలు జరగ్గా ఎస్ఎంసీ సభ్యులు చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్‌తో పాటు కో ఆప్టెడ్ సభ్యులను, మెంబర్లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలను ఎంపీడీవో కొండలరావు, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంఈవో కె.తాతారావులు పర్యవేక్షించారు. ఎన్నికల అనంతరం చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామకార్యదర్శులు, వీఆర్వోలు, రెవెన్యూ, పోలీస్, పంచాయతీ, విద్యాశాఖ సిబ్బంది, పాల్గొన్నారు.

ఆర్డీవో సుధాసాగర్, డీవైఈవోల పర్యవేక్షణలో ఎన్నికలు

మండపేట: మండపేట పట్టణం, రూరల్‌లో గురువారం పాఠశాల విద్యాకమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండపేట మండలం, అర్బన్ పాఠశాలల్లో జరిగిన విద్యాకమిటీ ఎన్నికలను రామచంద్రపురం ఆర్డీవో సుధాసాగర్, డీవైఈవో పని నరసింహులు పర్యవేక్షించారు. మండపేట అర్బన్, రూరల్‌లో మొత్తం 51 ప్రాథమిక పాఠశాలలు, పాఠశాలలతో పాటు, 12 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత పాఠశాలలకు ఎన్నికలు ప్రశాం తంగా జరిగాయని మండపేట మండల విద్యాధికారి నాయుడు రామచంద్రరావు తెలిపారు. మండపేట మండల అభివృద్ధి అధికారి శ్రీదేవి, ఇన్‌చార్జి తహసీల్దార్ అశోక్, ఈవోపీఆర్డీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: మండలంలో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో గురువారం స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని రాజోలు ఎంఈవో ఎన్.మనోహరం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మాట్లాడుతూ చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యుల ఎన్నిక సజావుగా జరిగాయన్నారు. వీరితో పాటు ఎక్స్‌అఫిషియో సభ్యులు, కోఆపరేటివ్ సభ్యులను కూడా ఎన్నుకున్నట్టు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను గాలిదేవర వెంకన్నబాబు అభినందించారు.

చైర్మన్, వైస్‌చైర్మన్లుగా కూటమికి చెందినవారే ఎన్నిక


ఇందుపల్లి జడ్పీ హైస్కూలు ఎస్ఎంసీ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం

ఎస్ఎంసీ చైర్మన్ల ఎంపిక

ఉప్పలగుప్తం: మండలంలోని 8ఉన్నత, రెండు ప్రాథమికోన్నత, 72 ప్రాథమిక పాఠశాలలకు గురువారం ప్రశాంత వాతావరణంలో నిర్వహణ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జడ్పీటీసీ గెడ్డం సంపదరావు, ఎంఈవోలు కె.కిరణ్‌బాబు, సత్తి సత్యకృష్ణ, కూటమినాయకులు అరిగెల నానాజీ, దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ కమిటీలను అభినందించారు.

ఆత్రేయపురం: మండలంలోని 17 గ్రామాల్లో ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం జరిగిన మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు స్వల్ప సంఘటనలు మినహా ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని 9 హైస్కూల్స్, 42 ప్రాథమిక పాఠశాలలు, 2 ప్రాథమికోన్నత పాఠశాలలకు ఎన్నికలు నిర్వహించారు. కొన్నిచోట్ల ఏకగ్రీవంకాగా మరికొన్ని చోట్ల చేతులు ఎత్తే పద్ధతులలో ఎన్నికలు నిర్వహించారు. ఆత్రేయపురం పెదపేటలో ఇరువర్గాల మధ్య స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. అనంతరం సద్దుమణిగింది. చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యులను ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఎంఈవో పి.వరప్రసాదరావు ఎన్నికలను పర్యవేక్షించారు. అధికార పార్టీ నాయకులు, సర్పంచ్‌లు నూతన కమిటీలను అభినందించారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): రామచంద్రపురం మండలం, పట్టణంలో పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో మానుపూడి శ్రీనివాస్ తెలిపారు. మండలంలో 46 ప్రాథమిక, 8 ప్రాథమికోన్నత పాఠశాలలు, 5 జెడ్పీ ఉన్నత పాఠశాలలు, వేగాయమ్మపేట ప్రభుత్వ ఉన్నతపాఠశాల, ఆదివారపుపేట ఎస్సీబాలుర గురుకుల పాఠశాల, వెలంపాలెం బీసీబాలికల గురుకుల పాఠశాలలకు ఎన్నికలు జరిగాయి. పట్టణంలో 16 ప్రాథమిక పాఠశాలలు, 5మున్సిపల్ ఉన్నత పాఠశాలలు, జెడ్పీబాలిక ఉన్నత పాఠశాల, కృత్తివెంటి పేర్రాజు పంతులు జాతీయోన్నత ప్రభుత్వ పాఠశాలలకు ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో తెలిపారు.


పి.గన్నవరంలో చైర్మన్, వైస్ చైర్మన్లను సత్కరిస్తున్నఎమ్మెల్యే గిడ్డి

ఆలమూరు: ఆలమూరు మండలంలో గురువారం విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఆలమూరు, చెముడులంక, మూలస్థానం, నర్సిపూడి, జొన్నాడ, సంధిపూడి జడ్పీ హైస్కూల్స్, ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతోపాటు మండలంలోని వివిధ ప్రాథమిక పాఠశాలలో విద్యాకమిటీ ఎన్నికలు జరిగాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఏకగ్రీవంగా ఎన్నికలు జరిపించారు.

అల్లవరం: మండల పరిధిలోని 79 పాఠశాలల యజమాన్య కమిటీల చైర్మన్ పదవులకు ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 64 పాఠశాలలు చైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నుకోగా 15 పాఠశాలలకు ఓటింగ్ పద్ధతిన చైర్మన్ ఎన్నిక జరిగిందని ఎంఈవో కె.కిరణ్‌బాబు తెలిపారు. తహసీల్దారు బి.సునీల్‌కుమార్, ఎంఈవోలు ఎన్నికలను పరిశీలించారు.

రావులపాలెం: రావులపాలెం మండలంలోని జడ్పీ, ఎంపీపీ పాఠశాలలో నిర్వహించిన ఎస్ఎంసీ ఎన్నికలు ఏకగ్రీవంగా ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. 9 జడ్పీ పాఠశాలలు, 44ఎంపీపీ పాఠశాలలలో నిర్వహించిన ఎస్ఎంసీ చైర్మన్ ఎన్నికలలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, సభ్యులను ఘనంగా సత్కరించారు.

'విద్యాకమిటీ చైర్మన్లు బాధ్యతగా వ్యవహరించాలి'

కొత్తపేట: నూతనంగా ఎన్నికైన విద్యాకమిటీ చైర్మన్లు బాధ్యతగా వ్యహరించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. పాఠశాలల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం చైర్మన్లగా ఎంపికైన వారిని ఆయన అభినందించారు. కొత్తపేట మండలానికి సంబంధించి 83 పాఠశాలలు ఉండగా గురువారం జరిగిన ఎన్నికలలో 49 పాఠశాలలో కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకోగా 34 పాఠశాలలో ఓటింగ్ ద్వారా కమిటీలను ఎన్నుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు తెలిపారు. నాయకులు కంఠంశెట్టి శ్రీనివాస్, దర్నాల రామకృష్ణ, బూసి భాస్కరరావు, కముజు వెంకటేశ్వరరావు, గుబ్బల మూర్తి, వాసంశెట్టి సత్యనారాయణ, విళ్ల మారుతీప్రసాద్, కముజు తాతాజీ, ఎంఈవోలు ఎం.హరిప్రసాద్, డి.రామచంద్రమూర్తి పాల్గొన్నారు.

పోస్టాఫీసుతో విడదీయరాని బంధం

● ప్రముఖ రచయిత, సినీ దర్శకుడు వంశీ


మండపేటలో రచయిత వంశీని సత్కరిస్తున్న పోస్టల్ ఉదోగులు

మండపేట, ఆగస్టు 8: పోస్టాఫీసుతో తనకు వున్న చిన్ననాటి జ్ఞాపకాలను ప్రముఖ చలనచిత్ర దర్శకుడు రచయిత వంశీ నేమరు వేసుకున్నారు. పోస్టాఫీసులో లభ్యమయ్యే లేఖల ద్వారా తాను రాసిన కథల గురించి కళాశాలలో చదువుకున్నపుడు రాసిన ప్రేమలేఖలు గురించి ఆయన అనుభవాలను మండపేట పోస్టల్ సిబ్బందితో గురువారం పంచుకున్నారు. పోస్టుకార్డులు ఇన్‌లాన్డ్ లెటర్లు విశిష్టత గురించి అందులో రాసిన లేఖలు విశిష్టతను ఆయన గుర్తుచేసుకున్నారు. గురువారం మండపేటలో జరిగిన ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన మండపేటలో కొద్దిసేపు పట్టణంలో వున్న పోస్టాఫీసును సందర్శించారు. ఆయన పోస్టాఫీసుతో వున్న సంబంధాలను నేమరువేసుకుంటూ పోస్టుకార్డులు, ఇన్‌లాన్డ్ లెటర్లను స్వయంగా వంశీ కొనుగోలు చేశారు. నేటికి పోస్టల్‌శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలను ఆయన కొనియాడారు. వంశీని పోస్టల్ ఉద్యోగులు సత్కరించారు. కార్యక్రమంలో మండపేట పోస్టుమాస్టర్ ఎం.వి.సుబ్బారెడ్డి, పోస్టల్ ఉద్యోగులు కె.వి.నారాయణరావు(బాబి), కొండపల్లి సూర్యనారాయణ, జి.శివయ్య, షరీఫ్, ప్రవీణ్‌శంకర్‌తోపాటు పట్టణానికి చెందిన చిర్ల ఆదిరెడ్డి, సుందరపల్లి వెంకటరత్నం, తదితరులు ఉన్నారు.

83 మందికి ఉద్యోగ అవకాశాలు

అమలాపురం టౌన్, ఆగస్టు 8: అమలాపురం జిల్లా ఉపాధి కార్యాలయం వద్ద గురువారం ప్రముఖ ప్రైవేటు కంపెనీ కేఎల్ గ్రూప్(చెన్నై)లో పనిచేసేందుకు జాబ్‌మేళా నిర్వహించింది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నిరుద్యోగ అభ్యర్థుల సమావేశంలో జిల్లా ఉపాధి కల్పనాధికారిణి యి.వసంతలక్ష్మి మాట్లాడుతూ ఉద్యోగానికి ఎంపికైన ఉద్యోగార్థులు దూరాభారాలను పట్టించుకోకుండా మొదటిగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అంచెలంచెలుగా ఎదగాలన్నారు. జాబ్ మేళాలలో 83 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపిక కాగా నియామక పత్రాలను ఆమె అందజేశారు. జాబ్‌మేళాకు 189 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో కేఎల్ గ్రూపు కంపెనీ ప్రతినిధులతో పాటు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

డెంగ్యూ కలకలంతో సర్వే

మామిడికుదురు, ఆగస్టు 8: మామిడికుదురు గ్రామానికి చెందిన ఒక యువకుడికి డెంగ్యూ వ్యాధి నిర్ధారణ కావడంతో గ్రామంలో పీహెచ్‌సీ వారు ఫీవర్ సర్వే చేపట్టారు. మామిడికుదురు గ్రామానికి చెందిన చిట్టూరి భరత్ అనే యువకుడు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తూ జ్వర లక్షణాలతో స్వగ్రామం వచ్చాడు. సదరు యువకుడు అమలాపురంలో డెంగ్యూ పరీక్ష చేయించుకోగా అది డెంగ్యూ నిర్ధారణ కావడంతో పీహెచ్‌సీవారు ఇంటింటీ తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించారు. ప్రతీ ఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. విడవకుండా జ్వర లక్షణాలు ఉంటే వైద్యాధికారులను సంప్రదించాలని సూచించారు.

వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.1.21 లక్షలు

ఆత్రేయపురం, ఆగస్టు 8: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామిని గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,21,753 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

వైశ్య సంఘ అధ్యక్షుడిగా నంబూరి


వైశ్య సంఘ నూతన కార్యవర్గ ప్రతినిధులు

అమలాపురం టౌన్, ఆగస్టు 8: అమలాపురం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి వైశ్య సంఘ అధ్యక్షునిగా నంబూరి సత్యనారాయణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పచ్చిగోళ్ల జనార్దనరావు కల్యాణ మండపంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నూతన కార్యవర్గ ప్రధాన కార్యదర్శిగా నంబూరి నరేష్, కోశాధికారిగా కొమ్మూరి వెంకటాచలప్రసాద్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. వైశ్య సంఘ ప్రముఖులు, వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

నేడు యూత్ మారథాన్

అమలాపురం టౌన్, ఆగస్టు 8: జిల్లాలో శుక్రవారం యూత్ ఫెస్ట్ నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ సీహెచ్‌వీ భరతలక్ష్మి తెలిపారు. యూత్ ఫెస్ట్‌లో భాగంగా తొలుత యూత్ మారథాన్ నిర్వహిస్తామన్నారు. పాఠశాలల నుంచి విద్యార్థులను తీసుకువచ్చేలా పీడీలు, పీఈటీలు చర్యలు తీసుకోవాలన్నారు. యూత్ మారథాన్ ర్యాలీని ఎస్పీ బి.కృష్ణారావు భట్నవిల్లిలో ప్రారంభిస్తారన్నారు. యువతలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించే కార్యక్రమంలో భాగంగా 17 నుంచి 25 ఏళ్ల లోపు యువత కోసం యూత్ మారథాన్‌తో పాటు రెడ్ రిబ్బన్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రెడ్ రన్ మారథాన్ భట్నవిల్లి బైపాస్ నుంచి పేరూరు వై.జంక్షన్ వరకు ఐదు కిలోమీటర్ల మేర ఉంటుందన్నారు. విద్యార్థులకు ఈ నెల 13వ తేదీన అమలాపురం ఏరియా ఆసుపత్రిలో క్విజ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. క్విజ్ పోటీలకు 8వ తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం చదివే విద్యార్థులు మాత్రమే అర్హులని డాక్టర్ భరతలక్ష్మి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బీజేపీ నాయకుడు సూర్యారావు మృతి

● పలువురు సంతాపం



అమలాపురం రూరల్, ఆగస్టు 8: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీజేపీ ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి కొల్లి సూర్యారావు (53) గురువారం ఉదయం మృతిచెందారు. అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గ్రామానికి చెందిన సూర్యారావు బుధవారం సాయంత్రం అమలాపురం వచ్చారు. పని ముగించుకుని రాత్రివేళ ఈదరపల్లి-ముక్కామల బైపాస్ రోడ్డులో మోటారుసైకిల్‌పై ఇంటికి బయలుదేరారు. పాలగుమ్మి అయ్యప్పస్వామి ఆలయం వద్దకు వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం సూర్యారావు మోటారు సైకిల్‌ను వేగంగా వచ్చి ఢీకొట్టింది. స్థానికులు గుర్తించి హుటాహుటిన అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కిమ్స్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ సూర్యారావు ఉదయం మృతిచెందారు. ఈయనకు భార్య, పిల్లలు ఉన్నారు. సూర్యారావు సోదరుడు గంగాధరం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. బీజేపీ సీనియర్ నాయకుడు సూర్యారావు మృతి సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆయన ఇంటికి చేరుకుని నివాళులర్పించారు. బీజేపీ జిల్లాశాఖ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆయన మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆకుమర్తి బేబీరాణి, మోకా వెంకటసుబ్బారావు, గునిశెట్టి వెంకటేశ్వరరావు, చీకురుమెల్లి శ్రీనివాస్, కొండేటి ఈశ్వర్‌గౌడ్, బొంతు శివాజీ తదితరులు పాల్గొని సంతాపం తెలిపారు.

సూర్యారావు మృతికి నేతలు సంతాపం

అంబాజీపేట: పుల్లేటికుర్రుకు చెందిన బీజేపీ నాయకుడు కొల్లి సూర్యారావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బీజేపీలో జిల్లా ఎస్సీ మోర్చ అధ్యక్షుడిగా, ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా సూర్యారావు పనిచేశారు. పి.గన్నవరం అసెంబ్లీ అభ్యర్థిగా బీజేపీ నుంచి పోటీ చేశారు. సూర్యారావు మృతిపట్ల పలువురు నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

అనుమతులు లేని లాడ్జిల మూసివేత

యానాం, ఆగస్టు 8: యానాం నియోజకవర్గ పరిధిలోని అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న లాడ్జిలను మూసివేసి నట్లు ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణా తెలిపారు. ఫెర్రిరోడ్డులోని ఉన్న మూడు, బైపాస్‌లో ఉన్న ఒక లాడ్జిని మూయించి వేశారు.

బాలబాలాజీ సన్నిధిలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు

మామిడికుదురు, ఆగస్టు 8: అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తున్నట్టు సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. ఈ వ్రతాల్లో పాల్గొనే భక్తులు ఉదయం 10 గంటలకల్లా స్వామివారి నూతన ఆలయానికి రావాలని కోరారు.

ఆరోగ్య కేంద్రాన్ని, వసతి గృహాన్ని పరిశీలించిన ఆర్డీవో

రాయవరం, ఆగస్టు 8: మండలకేంద్రం రాయవరంలో శిథిలా వస్థలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రామచంద్రపురం ఆర్డీవో సుధాసాగర్ గురువారం పరిశీలించారు. టీడీపీ నాయకులు వుండవల్లి రాంబాబు, ఎలుగుబంట్ల గోపీకృష్ణ, వైద్యాధికారి అనరుధ్, సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు ఆసుపత్రి పరిస్థితిని ఆర్డీవోకు వివరించారు. ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో వర్షాలు వచ్చేటప్పుడు నీరు కారిపోతుంది. విద్యుత్ షాక్‌లు తగులుతున్న విషయాన్ని సిబ్బంది వివరిం చారు. దీనిపై ఆర్డీవో మాట్లాడుతూ విషయం తమ దృష్టికి వచ్చిందని పరిశీలనకు వచ్చినట్లు చెప్పారు. ప్రస్తుతానికి నిరుపయోగంగా ఉన్న బాలికల వసతి గృహంలోకి మార్చేం దుకు పరిశీలన చేస్తున్నామని చెప్పారు.

తిరుమలలో ఎమ్మెల్యే వేగుళ్ల జన్మదిన వేడుకలు

మండపేట, ఆగస్టు 8: మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వ రరావు జన్మదిన వేడుకలను తిరుమలలో గురువారం టీడీపీ శ్రేణులు, అభిమానుల నడుమ ఘనంగా జరుపుకున్నారు. తొలుత వేగుళ్ల పుట్టినరోజు సందర్భంగా స్వామివారిని దర్శించుకున్న అనంతరం అభిమానులు మధ్య జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. మండపేట పార్టీ కార్యాలయంలో పార్టీపట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, మండపేట మండల టీడీపీ అధ్యక్షుడు యరగతపు బాబ్జిల సారథ్యంలో కేక్‌లు కట్‌చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.

కపిలేశ్వరపురం: జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పుత్సల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్‌కట్‌చేసి వేగుళ్ళకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మత్స గంగరాజు, బల్లోజు నాని, చీకట్ల శ్రీను, రమేష్, ఆచంట చిన్న, మారుతి, మేడేపల్లి రామకృష్ణ, నాని, కరీమ్, నాగేంద్ర, బ్రహ్మాజీ, యానాల సుబ్బారావు పాల్గొన్నారు.

కోర్టుల ఆవరణలో నిలిచిన వర్షపునీరు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 8 : బుధవారం రాత్రి నుండి కురిసిన భారీ వర్షంతో పట్టణంలోపలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. జూనియర్ సివిల్ జడ్జి, సీనియర్ సివిల్ జడ్జి కోరుల ఆవరణ వర్షపు నీరు నిలిచిపోయింది. ట్రెజరీకార్యాలయం వరకు వర్షపు నీరు నిలిచిపోవడంతో న్యాయవాదులు, కోర్టు అధికారులు, సిబ్బంది, కక్షిదారులు ఇబ్బందులు పడ్డారు. పట్టణంలో పలువార్డుల్లో మంత్రి సుభాష్ తండ్రి సత్యం పర్యటించారు. డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు.

ఇంజనీరింగ్ విద్యార్థినికి రూ.25వేలు సాయం

అమలాపురం రూరల్, ఆగస్టు 8: పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించి విజయనగరం ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశం పొందిన బండారులంకకు చెందిన పేద విద్యార్థిని లక్కింశెట్టి వర్షితకు గారపాటి వీర్రాజు మెమోరియల్ ట్రస్టు అండగా నిలిచింది. వర్షిత హాస్టల్ ఫీజు నిమిత్తం ట్రస్టు చైర్మన్ గారపాటి సూర్యనారాయణ, రూ.25 వేలు ఆర్థికసాయాన్ని ఆమె తండ్రికి అందజేశారు. ప్రతీ ఏటా ఆర్థికసాయం అందిస్తామని కార్యదర్శి సాధనాల నాగేశ్వరరావు, కోశాధికారి బసవా శ్రీనివాసరావు తెలిపారు.

మంత్రివర్గ నిర్ణయం పట్ల డీలర్ల హర్షం

అమలాపురం టౌన్, ఆగస్టు 8: చౌకధరల దుకాణాల ద్వారానే బియ్యంతో పాటు ఇతర నిత్యావసర సరుకులను డీలర్లే విక్రయించేలా మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం పట్ల గురువారం రేషన్ డీలర్లు హర్షాతిరేకం వ్యక్తం చేశారు. కోనసీమ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం అధ్యక్షుడు అడపా వెంకటరమణ, వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు దొమ్మేటి ఏడుకొండలు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నడింపల్లి అన్నపూర్ణ, డివిజన్ కార్యదర్శి పర్వతం సత్యనారాయణ, అరిగెల బాబ్జి, ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించండి: మంత్రి సుభాష్


వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న మంత్రి సుభాష్

కె.గంగవరం, ఆగస్టు8: ప్రభుత్వ ఆసుపత్రులలో నాణ్యమైన వైద్యసే వలు అందించాలని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గురువారం ఆయన కుందూరు ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టీ, రికార్డులు పరిశీలించారు. వైద్య సిబ్బందితో మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన వైద్యపరీక్షలు, రక్తపరీక్షలు నిర్వహించాలని సూచించారు. వైద్యాధికారిణి రత్నసుధ, వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామానికి చెందిన సీహెచ్.సత్యవతి తనకు కళ్లు సరిగా కనపడటంలేదని సహాయం చేయాలని కోరగా మంత్రి సుభాష్ రూ.10,000లు ఆర్థిక సాయం చేశారు. మెరుగైన వైద్యం చేయించి, పింఛను వచ్చే విధంగా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కూ టమి నాయకులు పామర్తి బాబి, జగతా రమణ, మేడిశెట్టి బాబి, పళ్ల చినబాబు, సిరా సురేష్, తాడి చంటి, మండి రమణ పాల్గొన్నారు.

మంత్రి సుభాష్ ఆర్థిక సహాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 8: రామచంద్రపురం టీడీపీ కార్యాలయంలో పనిచేస్తున్న కొండయ్యపాలెపు నాగబాబు సతీమణి సత్యకు గురువారం రూ. 25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సత్య అనారోగ్యంతో ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతుండగా మంత్రి సుభాష్ పరామర్శించి సాయం అందజేశారు.

వక్ఫ్‌బోర్డు బిల్లు సెలెక్ట్ కమిటీకి పంపించడం అభినందనీయం

మామిడికుదురు, ఆగస్టు 8: పార్లమెంటులో బీజేపీ ప్రవేశ పెట్టిన వక్ఫ్‌బోర్డు బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించేందుకు అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్ లోక్‌సభలో చేసిన పోరాటం అద్భుతమని టీడీపీ మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి హాజీ ముఖరం హుస్సేన్ అన్నారు. ముస్లిం సమాజంలో వక్ఫ్‌బోర్డు బిల్లుపై అనేక అనుమానాలు ఉన్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు గురువారం పార్లమెంటులో ఎంపీ హరీష్‌మాధుర్ బిల్లును మైనార్టీ కేంద్రమంత్రి కిరణ్ రిజుజూ సెలెక్ట్ కమిటీకి పంపించేందుకు అంగీకరించడం అభినందనీయమన్నారు. పార్లమెంటు సెలెక్ట్ కమిటీ ఈ బిల్లుపై విస్తృతంగా చర్చించి ముస్లిం సమాజంలో ఉన్న అనుమానాలు తొలగించాలని కోరారు. కార్యక్రమంలో సర్కిల్ రజా అలీ, మీర్ కరమ్ అలీ, ఎంకే అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

కవర్లు నిర్మూలనకు కాటన్ బ్యాగ్‌లు

● ఉపాధ్యాయుడు చిరు ప్రయత్నం


కాటన్ బ్యాగ్‌లను అందిస్తున్న వీఆర్వో పద్మావతి

పి.గన్నవరం, ఆగస్టు 8: స్వచ్ఛభారత్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో మార్పు తీసుకురావాలని ప్రయత్నం చేస్తోంది. కానీ ప్రజల్లో మాత్రం ప్లాస్టిక్ కవర్ల విషయంలో మార్పురాలేదు. కవర్లువల్ల కలిగే నష్టాలను తెలుపుతూ వాటిని పూర్తిగా నిర్మూలించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని కోరుతూ మానేపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న రామకృష్ణ కాటన్ బ్యాగ్‌లను ఏర్పాటుచేసి ప్రజల్లో మార్పుకోసం చిరు ప్రయత్నం చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుడు ఏర్పాటుచేసిన సుమారు 500 కాటన్ బ్యాగ్‌లను వీఆర్వో డి.పద్మావతి, నూతన విద్యాకమిటీ చైర్మన్ జోగి కుమార్ కృష్ణ గురువారం స్థానికులకు అందించారు.

చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం

కొత్తపేట, ఆగస్టు 8: డీలర్లకు మంచిరోజులు వస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన ప్రకటనపై రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద మండల రేషన్ డీలర్లు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌తోపాటు పురందేశ్వరి, నాదెండ్ల మనోహర్, బండారు సత్యానందరావు, డీలర్ల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు మాదవరావు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో డీలర్స్ సంఘం అధ్యక్షుడు నల్లం వెంకటరమణమూర్తి(బాల), ఉపాధ్యక్షుడు మెహర్‌బాబా, గనిశెట్టి శ్రీనివాస్, గాదం శ్రీను, రవి, బొరుసు వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు 27 కొత్త బస్సులు

అమలాపురం టౌన్, ఆగస్టు 8: ప్రయాణికుల సౌకర్యార్థం రాష్ట్ర వ్యాప్తంగా 1400 నూతన బస్సులను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని అమలాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ సీహెచ్ఎస్ఎన్ మూర్తి తెలిపారు. దీనిలో భాగంగా జిల్లాకు కేటాయించిన 27 ఆర్టీసీ బస్సులను రవాణాశాఖ మంత్రి ఎం.రామ్‌ప్రసాద్‌రెడ్డి ఏలూరు డిపోలో ప్రారంభించారు. ఏలూరు బస్ డిపో నుంచి ర్యాలీగా కొత్త బస్సులు బయలుదేరాయి. అమలాపురం ఆర్టీసీ డిపోకు 3 సూపర్‌లగ్జరీ బస్సులు, రాజోలు డిపోకు 2 సూపర్ లగ్జరీ బస్సులు కేటాయించారన్నారు. జిల్లా డీపీటీవో ఎం.శ్రీనివాసరావుతో పాటు డిపో మేనేజర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు ప్రశంసా పత్రాలు

రాజోలు, ఆగస్టు 8: ఏపీఎస్ ఆర్టీసీ రాజోలు డిపోలో గత నెలలో అత్యధిక ఈపీకే సాధించిన కండక్టర్లకు, అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లకు డిపో మేనేజర్ పి. భాస్కరరావు, డిప్యూటీ సీఎంఈ ఎస్కే. రవిశంకర్ ఆధ్వర్యంలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ గురువారం జరిగింది. సభలో కండక్టర్లు, డ్రైవర్లకు నగదు అవార్డుతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన రవిశంకర్ మాట్లాడుతూ భవిష్యత్తులో వీరిని ఆదర్శంగా తీసుకుని మిగతా కండక్టరు, డ్రైవర్లు ఉత్సాహంతో పనిచేసి డిపోను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీఐ కేకే దొర, ఎంఎ రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు

ఆత్రేయపురం, ఆగస్టు 8: వరకట్న వేధింపులపై మహిళా కానిస్టేబుల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామానికి చెందిన కోట వీరమణి ఆత్రేయపురం పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2021లో తాడేపల్లిగూడెం మండలం లింగరాయుడుగూడెంన కు చెందిన యెలిగంటి అంతర్వేది నర్సన్నతో పెద్దల సమక్షంలో వీరమణితో వివాహం జరిపించారు. పెళ్లి సమయంలో రూ.2 లక్షల కట్నం రూ.50 వేలు ఆడపడుచు కట్నం ఇచ్చారు. నర్సన్నకు ఉద్యోగం వస్తుందని నమ్మించి వివాహం చేశారు. కొద్దిరోజులు గడిచిన తర్వాత అదనపు కట్నం కోసం భర్త నర్సన్న అతని తల్లిదండ్రులు సోదరి, వేధింపులకు పాల్పడ్డారు. భర్త నర్సన్న ఎటువంటి ఉద్యోగం లేకుండా చెడు వ్యసనాలకు బానిసై శారీరకంగా, మానసికంగా వేధిస్తుండటంతో ఆమె ఆత్రేయపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

మద్యం దుకాణం వద్ద వ్యక్తి మృతి

అమలాపురం రూరల్, ఆగస్టు 8: అమలాపురం రూరల్ మండలం సమనస మద్యం దుకాణం వద్ద ఓ వ్యక్తి మృతిచెందాడు. తాలుకా ఎస్ఐ శేఖర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం సమనస గ్రామానికి చెందిన ఎం.ఏడుకొండలు(43) గురువారం ఉదయం నుంచి మద్యం సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో దుకాణం వద్దే మృతి చెందినట్లు తెలిపారు. ఏడుకొండలకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వర్గీకరణపై ఎమ్మెల్యేకు వినతి

మలికిపురం, ఆగస్టు 8: వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిలిపివేయాలని కోరుతూ రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు మాలమహానాడు నాయకులు వినతి పత్రం సమర్పించారు. సుప్రీంకోర్టు తీర్పుతో మాలలకు తీరని అన్యాయం జరుగుతుందని, ఈ విషయాలన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల దృష్టికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే దేవను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గెడ్డం సింహ, తోటే ప్రతాప్, గోనిపాటి రాజు, చింతా రాజబాబు, జగడం సత్యనారాయణ, రాపాక ఆనందరావు, గెడ్డం ఫిలిప్‌రాజు, తాడి సహదేవ్ ఉన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా న్యాయ పోరాటం చేస్తాం

రాజోలు, ఆగస్టు 8: రాజ్యాంగ వ్యతిరేకమైన ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడానికి న్యాయ పోరాటాన్ని ఉధృతం చేస్తామని రాజోలు మండల మాలల న్యాయ పోరాట సమితి జేఏసీ అధ్యక్షుడు మట్టా సురేష్‌కుమార్ రాజోలులో జేఏసీ ప్రధాన కార్యదర్శి లిఖితపూడి బుజ్జి అధ్యక్షతన గురువారం జేఏసీ కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో సురేష్ మాట్లాడుతూ జేఏసీ నియోజకవర్గ కోర్ కమిటీ ఆధ్వర్యంలో రాజోలు మండలంలో ఉన్న 16 గ్రామాల్లో జేఏసీ గ్రామ కమిటీల నిర్మాణం చేపట్టి మాలలకు జరుగుతున్న అన్యాయంపై న్యాయ పోరాటం చేస్తామన్నారు.